క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన పీఆర్టీయూ కార్యవర్గం


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న కార్యవర్గం

జగిత్యాల: ఇటీవల జగిత్యాల జిల్లా పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన బోయినపల్లి ఆనందరావు, అమర్‌నాథ్‌రెడ్డి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌లు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షుడు మల్లారెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్, శ్రీదేవి పాల్గొన్నారు.
సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత
సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.60 వేల విలువ గల చెక్కును ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మంగళవారం పట్టణానికి చెందిన లక్ష్మయ్యకు అందజేశారు.

ఒత్తిడిని అధిగమించాలి


మాట్లాడుతున్న ప్రోగ్రాం అధికారి అర్చన

జగిత్యాలరూరల్: ఒత్తిడిని అధిగమించినప్పుడే మనసు ప్రశాంతంగా ఉంటుందని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ అర్చన అన్నారు. కండ్లపల్లి మోడల్‌స్కూల్‌లో ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు మానసిక ఒత్తిడిని తట్టుకుని చక్కగా చదువుకుని జీవితంలో పైకి రావాలన్నారు. మానసిక ఆరోగ్యం గందరగోళంగా ఉంటే టెలిమానస్ 14416 ఫోన్ చేసి సూచనలు పొందాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగ సుధారాణి, రవీందర్, శంకర్ పాల్గొన్నారు.

తల్లిపాలతో ఆరోగ్యం

జగిత్యాలరూరల్: తల్లిపాలతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యమని సీడీపీవో మమత అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్‌లో పోషణ అభియాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళా గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం అయ్యేంత వరకు తల్లిపిల్లలు తీసుకోవాల్సిన పోషకాలు, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రెండేళ్లు దాటిన పిల్లలందరినీ అంగన్‌వాడీ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో కందుకూరి రవిబాబు, సూపర్‌వైజర్ లావణ్య, ఏఎన్ఎం శకుంతల, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి


సభ్యత్వ నమోదు చేస్తున్న బోనగిరి దేవయ్య

రాయికల్: రాష్ట్రంలోని విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని తపస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య డిమాండ్ చేశారు. మంగళవారం రాయికల్ మండలం కిష్టంపేట,అల్లీపూర్, ఆలూరు, కేజీబీవీ విద్యాలయంలో తపస్ సభ్యత్వ నమోదులో పాల్గొని మాట్లాడారు. 317 జీవో ఉపాధ్యాయులను వెంటనే తమ జిల్లాలకు పంపించాలని, ప్రధానోపాధ్యాయుల పోస్టులను మంజూరు చేసి బీఈడీ, డీఎడ్ చేసిన సెకండరీ గ్రేడ్ వారితో కామన్ సీనియార్టీతో భర్తీ చేయాలని, అదే విధంగా కేజీబీవీ పాఠశాలల్లో పనిచేసే వారికి పేస్కేలు అమలు చేయాలని, సాధారణ సెలవుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు చెరుకు మహేశ్వర శర్మ పాల్గొన్నారు.

రహదారిపై గుంతలు పూడ్చివేత


గుంతలు పూడ్చిన గణేశ్

మెట్‌పల్లి: జాతీయ రహదారిపై ఏర్పడ్డ పలు గుంతలకు ఓ వ్యక్తి తన సొంత ఖర్చులతో మరమ్మతు చేయించారు. వివరాల్లోకి వెళితే.. కోరుట్ల–మెట్‌పల్లి పట్టణాల మధ్య ఉన్న జాతీయ రహదారిపై పలు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. వీటికి మరమ్మతుల విషయంలో అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. దీంతో కోరుట్లకు చెందిన గణేష్ అనే వ్యక్తి మంగళవారం సిమెంట్ మిల్లర్ ద్వారా పలు గుంతలను పూడ్చి వేయించాడు. సొంతంగా డబ్బులు వెచ్చించి మరమ్మతు చేయించిన గణేష్‌ను పలువురు అభినందించారు.

నిరుపయోగంగా ఎస్సారెస్పీ కెనాల్

- ఆక్రమణకు గురైన డీ–53 కెనాల్
- వ్యవసాయానికి నీరందించే కెనాల్ మురికి నీటికి పరిమితం
- దృష్టి సారించని అధికార యంత్రాంగం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు


ఎస్సీ కాలనీ వద్ద కెనాల్‌లో నిలిచిన మురుగు నీరు


కెనాల్ కనిపించకుండా కెనాల్‌పై దట్టంగా పెరిగిన చెట్లు

వెల్గటూర్ : వ్యవసాయానికి నీరందించాల్సిన కాలువలు డ్రెయినేజీలుగా తయారయ్యాయి. మండల కేంద్రంలో సుమారు 150 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే ఎస్సారెస్పీ డీ–53 కెనాల్ మురుగు నీరు పారే డ్రెయినేజీగా తయారైంది. కెనాల్ మొత్తం దట్టమైన ముళ్ల పొదలు పెరిగి వ్యవసాయానికి పనికిరాకుండా పోయింది. అధికారుల అలసత్వంతో సానీరు రాకపోవడంతో పచ్చని పంటలు పండే పొలాలు బీడు భూములుగా మారిపోయాయి.

సాగునీరు రాక బీడు భూములుగా మారి
డీ–53 కెనాల్ వెల్గటూర్ మండలంలో కుమ్మరిపల్లి నుంచి కోటిలింగాల వరకు సుమారు 3 కి.మీ. మేర విస్తరించి ఉంటుంది. మండల కేంద్రంలోని సుమారు 150 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తుంది. ప్రస్తుతం సాగునీరు రాకపోవడంతో ఆయకట్టు సాగుభూములన్నీ బీడు భూములుగా మారిపోయాయి. కెనాల్ చుట్టూ దట్టమైన ముళ్లపొదలు, చెట్లు పెరిగి కెనాల్ దాదాపుగా ధ్వంసమయ్యే పరిస్థితికి చేరింది. కొన్నేళ్లుగా పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన ఈ కెనాల్‌పై అధికారులు దృష్టిసారించకపోవడంతో చాలా వరకు ఆక్రమణకు గురైంది.

డ్రెయినేజీగా మారిన కెనాల్
మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి డ్రెయినేజీ వ్యవస్థ అందుబాటులో లేకపోవడంతో కొన్నేళ్లుగా ఎస్సీ కాలనీలోని మురుగునీరు మొత్తం ఈ కెనాల్‌లోకే వదిలేస్తున్నారు. అందులోనూ కోటిలింగాల రోడ్డుకు కెనాల్ మూసివేసి దానిపై వ్యాపార కేంద్రాలు వెలిశాయి. ఈ క్రమంలో ఎస్సీ కాలనీ, కెనాల్ నుంచి వచ్చే మురుగునీరు కోటిలింగాల కమాన్ వద్ద పేరుకుపోయి పెద్ద మురుగునీటి గుంటలా మారిపోయింది. అసలే వర్షాకాలం కావడం, అందులోనూ డెంగీ విజృంభిస్తున్న తరుణంలో మురుగు నీటితో దోమలు, పందుల స్వైర విహారం చేసి ప్రజలు డెంగీ, చికున్‌గున్యా లాంటి విషజ్వరాల బారిన పడే ప్రమాదం ఉంది. కెనాల్ మూసివేసి అక్రమ నిర్మాణాలు చేయడంతో గత వర్షాకాలంలో కెనాల్ నుండి వెళ్లే పరిస్థితి లేక వరద నీరు మొత్తం ఎస్సీ కాలనీ, దుబ్బలవాడ కాలనీలలో ఇళ్లలో చేరి ఆయా కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి డీ–53 కెనాల్ పునరుద్ధరించి వ్యవసాయ పొలాలకు సాగు నీరు అందించి తమ ఇబ్బందులు తొలగించాలని రైతులు వేడుకుంటున్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలి
వెల్గటూర్‌లోని డీ–53 కెనాల్‌పై నిర్మించిన అక్రమ నిర్మాణాలు తొలగించాలి. ఈ అక్రమ నిర్మాణాల వల్ల కెనాల్‌లో నీరు వెళ్లకుండా వర్షాకాలంలో వరద నీరు మొత్తం దుబ్బలవాడ, ఎస్సీ కాలనీలోని ఇళ్లలోకి చేరి కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలు తొలగించాలి.
– బండమీది గోపి, దుబ్బలవాడ కాలనీ వాసి

గణేశ్ మండపాల్లో ప్రత్యేక పూజలు


పోరండ్లలో దీపారాధన చేస్తున్న మహిళలు


కోరుట్లలో అన్నదానం చేస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: గణపతి నవరాత్రి ఉత్సవాలు జిల్లా కేంద్రంలో ఘనంగా సాగుతున్నాయి. పట్టణంలోని గణేశ్ మంటపాలు, ఆలయాలు గణేశ్ నామస్మరణతో మార్మోగుతున్నాయి. మంగళవారం పట్టణంలోని శ్రీలక్ష్మిగణేష్ మందిరంలో గణనాథుడిని గరికతో అలంకరించారు. హారతి అనంతరం జరిగిన భజనలో దీక్షాస్వాములు పాల్గొన్నారు.
జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల వినాయక మండపంలో మంగళవారం రాత్రి మహిళలు దీపారాధన నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.
కోరుట్ల/కోరుట్ల రూరల్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద మంగళవారం అన్నదానం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, కమిషనర్ బట్టు తిరుపతి అన్నదానం ప్రారంభించారు. యెకీన్‌పూర్ గ్రామంలో ఎవర్ గ్రీన్ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కాటిపల్లి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు.

మల్లాపూర్‌లో ఎస్సై దంపతుల పూజలు
మల్లాపూర్: మల్లాపూర్‌లో ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపంలో విఘ్నేశ్వరుడిని ఎస్సై కిరణ్‌కుమార్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వయోజన విద్యా కేంద్రం ప్రారంభం


రాయపట్నంలో వయోజన విద్యా కేంద్రం

ధర్మపురి: వయోజనులకు విద్య నేర్పి నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికే వయోజన విద్యా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం మల్లికార్జున అన్నారు. ఇండియా లిటరసీ ట్రస్ట్, గుడ్ షెఫర్డ్ గాస్పెల్ చర్చి ఆధ్వర్యంలో మండలంలో మొత్తం 15 వయోజన విద్యా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండలంలోని రాయపట్నం అంబేద్కర్ భవనంలో కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన ఉపాధ్యాయులకు పలుకలు, బ్లాక్‌బోర్డ్స్, చార్జింగ్ లైట్లు పంపిణీ చేశారు. పది నెలల పాటు శిక్షణ పొందుతున్న వారికి తప్పక చదవడానికి రాయగలిగే విధంగా పూర్తి చేసుకున్న వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేంద్రం నిర్వాహకుడు అవునూరి యేషయ్య, పాస్టర్ శాంతికుమార్, జోసెఫ్, నాయకులు పాల్గొన్నారు.

వృద్ధుల ఆత్మహత్యల నివారణ పిల్లల బాధ్యత

జగిత్యాల: వృద్ధుల ఆత్మహత్యల నివారణ వారి పిల్లల సామాజిక బాధ్యత అని సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ అన్నారు. సంఘ భవనంలో ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులైన తల్లిదండ్రులు తమ ఆత్మహత్యే శరణ్యమని, కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, పిల్లలు వారికి అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో విశ్వనాథం, ప్రకాశ్, విజయ్ పాల్గొన్నారు.

లక్ష సభ్యత్వాలు లక్ష్యంగా పనిచేయాలి
జగిత్యాలటౌన్: నియోజకవర్గంలో లక్ష సభ్యత్వాలే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ ప్రభారి పల్లె గంగారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతీ బీజేపీ కార్యకర్త బూత్ స్థాయిలో కనీసం 200 మంది సభ్యత్వాలు నమోదు చేయించాలని కోరారు. 8800002024 నంబర్‌కు మిస్‌కాల్ ఇవ్వడం ద్వారా ప్రాథమిక సభ్యత్వ నమోదు కార్డును ఆన్ లైన్లో పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో సభ్యత్వ నమోదు జిల్లా కన్వీనర్ డాక్టర్ రఘు, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి భోగ శ్రావణి నాయకులు, పట్టణ పదాధికారులు, మండల అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన కాంగ్రెస్ నాయకులు
సారంగాపూర్: బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, భోగ శ్రావణి, జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారయణరావు సమక్షంలో బీజేపీలో చేరారు. సంకుటాల రాజేశం, లక్ష్మీ, శ్రీజ, వేముల రమేశ్ నాయకులకు ఆమె పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆడెపు నర్సయ్య, మాజీ జెడ్పీటీసీ పాత పద్మ, మాజీ సర్పంచ్ గర్షకుర్తి శిల్ప, నాయకులు పాల్గొన్నారు.

వేలం పాట వాయిదా
కోరుట్ల: పట్టణంలోని సాయిబాబా ఆలయంలో కొబ్బరికాయలు, పూజాసామగ్రి అమ్ముకొనుటకు, పూలు, పూల దండలు అమ్ముకొనుటకు, కొబ్బరికాయలు పోగు చేసుకొనుటకు మంగళవారం నిర్వహించిన వేలం పాట తిరిగి 16 తేదీకి వాయిదా వేసినట్టు ఆలయ కార్యనిర్వాహక అధికారి కే. కాంతారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గ్రామాల్లో డ్రై డే
కథలాపూర్: మండలంలోని అంబారిపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని గ్రామాల్లో మంగళవారం డ్రై డేగా నిర్వహించారు. దోమల బెడదతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని, ప్రజలకు దోమల నివారణకు అవగాహన కల్పించేందుకు డ్రై డే నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు ఇంటింటా తిరిగి ట్యాంకుల్లో నిల్వ నీటిని పారబోయించారు. ప్రజలు తమ ఇంటి ఆవరణను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యురాలు రచన, వైద్యసిబ్బంది సూచించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం
ఇబ్రహీంపట్నం: మండలంలోని డబ్బాలో కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో ఎల్‌ఐసీ ఏజెంట్ దుద్దుల జాన్ మృతి చెందారు. బాధిత కుటుంబానికి ఎల్‌ఐసీ లియాపి ఏజెంట్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రూ. 70 వేలు అందచేశారు. కార్యక్రమంలో పుప్పాల నర్సయ్య, ఎల్‌ఐసీ లియాపి అధ్యక్షుడు గూడురి రాజ గంగారం, కార్యదర్శి నాగభూషణ్, కోశాధికారి వాసల వినయ్, ఎల్‌ఐసీ ఏజెంట్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఇబ్రహీంపట్నం: రైతులు యాసంగి పంటలలో యాజమాన్య పద్ధతులు ఏ విధంగా పాటించాలో శాస్త్రవేత్తలు మంగళవారం రైతునేస్తంలో వీడియో కాన్ఫరెన్స్‌లో వివరించారు. శాస్త్రవేత్త సునీతా దేవి మాట్లాడుతూ యాసంగి పంటల సమయాప్తం గురించి, నీటి లభ్యత నేల స్వభావం వాతావరణం పరిస్థితులను బట్టి వివిధ పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. శాస్త్రవేత్త హేమంత్‌కుమార్ ప్రస్తుత పరిస్థితుల్లో వరిలో అగ్గి తెగులు, బ్యాక్టీరియా, ఆకు ఎండు తెగులు ఆశిస్తాయని, దీని నివారణకు రైతులు ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఏ మందులు వాడాలో వివరించారు. కార్యక్రమంలో ఏవో రాజ్‌కుమార్, ఏఈవోలు రవళి, రైతులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక దిగుబడి
ఇబ్రహీంపట్నం: ఆయిల్‌పామ్ పంటలతో అధిక దిగుబడి, అధిక ఆదాయం పొందవచ్చునని ఉద్యానవన అధికారి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని వర్షకొండ, కోమటికొండాపూర్ గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ పంటలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ పంటలు పండించిన రైతులకు ప్రభుత్వం 4 ఏళ్ల పాటు ఎకరానికి రూ. 4,200 చొప్పున చెల్లిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానలోహియ అధికారి రమేశ్, రైతులు పొనకంటి వెంకట్, సాయన్న, జనార్ధన్, పెద్దులు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పంటలు పరిశీలన

కథలాపూర్: మండలంలోని బొమ్మెన, సిరికొండ, గంభీర్‌పూర్, పోతారం గ్రామాల్లో వర్షాలతో నష్టపోయిన పంటలను మంగళవారం వ్యవసాయ అధికారులు పరిశీలించారు. పలు గ్రామాల్లో వరి పొలాల్లో ఇసుక మేటలు వేసినట్లు గుర్తించారు. రైతుల నుంచి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని వ్యవసాయశాఖ మండల నోడల్ ఆఫీసర్ శేఖర్ పేర్కొన్నారు.

నిమజ్జనం ఏర్పాట్లు పరిశీలన
బుగ్గారం : మండలంలో జరగబోయే వినాయక నిమజ్జనం సంబంధించిన ఏర్పాట్లను బుగ్గారం మండల కేంద్రంలోని చెరువు, ఎస్సారెస్పీ కెనాల్‌ను తహసీల్దార్ మాజిద్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎస్సై శ్రీధర్‌రెడ్డితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో నిమజ్జనం జరుపుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రుణమాఫీ కానీ రైతుల వివరాలు సేకరణ
మల్లాపూర్ : మండలంలోని సిరిపూర్‌లో మంగళవారం రుణమాఫీ కానీ రైతుల వద్దకు వెళ్లి మండల వ్యవసాయశాఖ అధికారులు వివరాలను సేకరించారు. ఎంపీడీవో జగదీష్‌తో కలిసి ఏవో లావణ్య వివరాలు సేకరించారు. మిట్టపెల్లి రాజవ్వకి రుణమాఫీ కాకపోవడంతో ఆమె ఇంటి వద్దకే వెళ్లి అధికారులు రుణమాఫీ అర్హతకు కావాల్సిన వివరాలను సేకరించారు. కార్యక్రమంలో ఏఈవో సంధ్య, దామెర రాజశేఖర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

భూవివాదానికి అధికారుల పరిష్కారం

ఇబ్రహీంపట్నం: మండలంలోని కేశాపూర్‌లో కొంత కాలంగా కొనసాగుతున్న భూ వివాదాన్ని తహసీల్దార్ ప్రసాద్, మెట్‌పల్లి డీఎస్పీ ఉమా మహేశ్వర్‌రావు పరిష్కరించారు. మంగళవారం కేశాపూర్‌లో గ్రామస్తులతో సమావేశం నిర్వహించి, సర్వే నంబర్ 86లో 1.10 గుంటల భూమి పునరావాసం కింద గ్రామానికి కేటాయించారని, కానీ గ్రామానికి చెందిన లక్కం శ్రీనివాస్ అనే వ్యక్తి కబ్జా చేసినట్లు అధికారులకు, గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో గ్రామస్తులకు, లక్కం శ్రీనివాస్‌కు గొడవలు జరుగుతుండటంతో డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, తహసీల్దార్ ప్రసాద్ సదరు భూమిని పరిశీలించి, ఎస్సారెస్పీ అధికారుల నుంచి ఈ భూమి ఎవరికి కేటాయించబడిందో పత్రాలను తీసుకవచ్చే వరకు గ్రామపంచాయతీ ఆధీనంలో ఈ భూమిని ఉంచుతామని అంత వరకు ఎవరు ఈ భూమిలోకి వెళ్లవద్దని తహసీల్దార్ ప్రసాద్ గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై అనిల్, ఆర్‌ఐ రమేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



రాయికల్: మండలంలోని రాజానగర్ ఎస్సీ ఎస్టీ కాలనీలో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుకిరువైపులా పూర్తిగా తెగిపోవడంతో మంగళవారం 'సాక్షి' దిన పత్రికలో ప్రచురించిన ఫొటో స్టోరీ కథనానికి పంచాయతీరాజ్ డీఈ మిలింద్, ఏఈ ప్రసాద్ స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించి వర్షం నీరు వెళ్లేలా పైప్‌లైన్ నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా'సాక్షి' కి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి స్పందన

వాట్సప్ చేయండి..
మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.
మా ఫోన్ నంబర్: 9705346639, 94400 61630, 9705346643


రాయికల్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు


మెట్‌పల్లిలో..

చాకలి ఐలమ్మకు ఘన నివాళి

జగిత్యాలరూరల్/కోరుట్ల/కోరుట్ల రూరల్/మెట్‌పల్లి/మల్లాపూర్/కథలాపూర్/పెగడపల్లి/మల్యాల: చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఆమెకు ఘనంగా నివాళి అర్పించారు. జిల్లా కేంద్రంలో, మండల కేంద్రాలు, గ్రామాల్లో ఆమె చిత్రపటాలు, విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి నుంచి విముక్తి కోసం ఎదురించి కొట్లాడిన చాకలి ఐలమ్మ మహిళలందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమాల్లో అధికారులు, రజకసంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.


పెగడపల్లిలో నివాళి అర్పిస్తున్న నాయకులు


మల్లాపూర్ మండలం మొగిలిపేటలో..

ఫేక్ ఫోన్ కాల్‌తో కలకలం

కథలాపూర్: 'మీ అమ్మాయి బ్యాగులో ఉన్న గంజాయి పోలీసుల తనిఖీలో దొరికిందని' ఫేక్ ఫోన్ కాల్ కుటుంబసభ్యులకు రావడం కథలాపూర్ మండలంలోని ఓ గ్రామంలో మంగళవారం కలకలం రేపింది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక కోరుట్లలో ఇంటర్ చదువుతోంది. రోజు మాదిరిగానే మంగళవారం సదరు బాలిక బస్సులో కళాశాలకు వెళ్లింది. బాలిక తల్లికి ఆగంతకుడు ఫోన్ చేసి మీ అమ్మాయి బ్యాగులో గంజాయి పోలీసుల తనిఖీల్లో దొరికిందని చెప్పడంతో వారు ఆందోళనకు గురయ్యారు. కొద్దిసేపు ఉత్కంఠ నెలకొంది. సమీపంలో ఉన్నవారు అప్రమత్తమై పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఫోన్ నెంబర్ ఆధారంగా ఆరా తీసి అది ఫేక్ ఫోన్ కాల్ అంటూ తేల్చారు. అందరు ఊపిరి పీల్చుకున్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి చెప్పే మాటలకు ప్రజలు స్పందించవద్దని ఎస్సై నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

మెట్‌పల్లిరూరల్: మండలంలోని వెల్లుల జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఐసీటీసీ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై మంగళవారం విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్‌కు సంబంధించి పరీక్షలను మెట్‌పల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా చేస్తారని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఐసీటీసీ సభ్యులు వివరించారు.ఈ వ్యాధి గ్రస్తులపై సమాజంలో ఎలాంటి వివక్ష చూపవద్దని సూచించారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ రమేశ్, హెచ్‌ఎం రవీందర్,ఎన్‌జీవో సిబ్బంది రవళి, రాణి, తదితరులు పాల్గొన్నారు.

ఖాదీ కాంప్లెక్స్ నిర్మాణ పనులపై విచారణ చేపట్టాలి

మెట్‌పల్లి: పట్టణంలోని ఖాదీ ప్రతిష్టాన్‌కు సంబంధించిన కాంప్లెక్స్ నిర్మాణంలో అక్రమాలు జరిగాయని, దీనిపై విచారణ జరిపించాలని కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఆర్డీవో శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఖాదీ కాంప్లెక్స్ పనులను నాసిరకంగా చేపట్టడంతో లీకేజీలు ఏర్పడి దుకాణాల నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ సందర్భంగా ఆయనకు వివరించారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులైన ఖాదీ చైర్మన్, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎర్రొళ్ల హన్మండ్లు, యామ రాజయ్య, రైసుద్దీన్, సంగు గంగాధర్, పొన్నాల మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు..

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు

మెట్‌పల్లి: మండల తహసీల్దార్‌గా శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన శేఖర్ నిజామాబాద్‌కు బదిలీపై వెళ్లిపోయారు. సోమవారం జిల్లాలో పలువురు తహసీల్దార్లను బదిలీ చేసిన ఉన్నతాధికారులు, పెగడపల్లి తహసీల్దార్‌గా ఉన్న శ్రీనివాస్ మెట్‌పల్లికి బదిలీ చేశారు.
సారంగాపూర్: సారంగాపూర్ తహసీల్దార్‌గా కె.వరందన్, బీర్‌పూర్ తహసీల్దార్‌గా ఎం కె. ముంతాజుద్దీన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సారంగాపూర్ తహసీల్దార్‌గా ఉన్న రమేశ్, బీర్‌పూర్ తహసీల్దార్‌గా ఉన్న శ్రీనివాస్‌లు బదిలీపై వెళ్లడంతో వారి స్థానంలో వరందన్, ముంతాజుద్దీన్‌లు నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. వారికి కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.
పెగడపల్లి: మండల తహసీల్దార్‌గా రవీందర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ శ్రీనివాస్ మెట్‌పల్లికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో మంచిర్యాల జిల్లాలో ఉన్న రవీందర్‌ను పెగడపల్లి తహసీల్దార్‌గా నియమించారు. రవీందర్‌ను సిబ్బంది కలిసి పరిచయం చేసుకుని పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.
కథలాపూర్: మండల తహసీల్దార్‌గా వెన్న వినోద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ ముంతాజిబొద్దీన్ బీర్‌పూర్ మండలానికి బదిలీ కావడంతో మంగళవారం రిలీవ్ అయ్యారు. నిజామాబాద్ జిల్లాలో డెప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన వినోద్ తహసీల్దార్‌గా పదోన్నతి పొందారు. ఈ మేరకు వినోద్ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించి అధికారులను పరిచయం చేసుకున్నారు.